నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 19 జూన్ 2024 | PEDDAPALLI

నేడు కరీంనగర్‌కు బండి సంజయ్

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హోదాలో రాక
- ఘన స్వాగతం తెలిపేందుకు శ్రేణుల ఏర్పాట్లు

విద్యానగర్, జూన్ 18: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం జిల్లాకు వస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆయనకు ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో వెళ్లారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవి వరించగా, ఈ నెల 13న అక్కడే బాధ్యతలు స్వీకరించారు. అదే రోజు అభిమానులు, నాయకులు ఢిల్లీ వెళ్లి అభినందనలు తెలిపారు. సెంట్రల్ మినిస్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారిగా కరీంనగర్ వస్తున్న ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. ఉదయం 9 గం టలకు శనిగరం స్టేజ్ వద్ద ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. సంజయ్ అక్కడి నుంచి నాయకులతో బయలు దేరి, నగరంలోని మహాశక్తి ఆలయానికి చేరుకుంటారు. తర్వాత కొండగట్టు అంజన్న క్షేత్రం, నల్లగొండ లక్ష్మీ నరసింహ స్వామి, వేములవాడ రాజన్న, సిరిసిల్ల మార్కండేయ స్వామిని దర్శించుకొని పూజలు చేస్తారని, ఈ నెల 23 వరకు వివిధ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

సివిల్స్ శిక్షణకు ఆహ్వానం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 18: సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్ ఉచిత శిక్షణ కోసం డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా (కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19నుంచి జూలై 3 వరకు వెబ్‌సైట్‌లో (www.tgbcstudycircle.cgg.gov.in) అప్లై చేసుకోవాలని సూచించారు. జూలై 18 నుంచి 18మార్చి 2025వరకు మొత్తం 150మందికి ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా వంద మందిని, ఇదివరకు యూపీఎస్సీ ద్వారా నిర్వహించిన సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 50మందిని నేరుగా శిక్షణకు తీసుకుంటారని వివరించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు వసతి, భోజన, రవాణా ప్రయోజనం కోసం నెలకు ₹5వేలు, పుస్తకాల కోసం ₹5వేలు అందిస్తారని చెప్పారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ మేరకు అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు

- అక్రమ నిర్మాణాలపై విచారణ
- భూకబ్జాలపై ప్రజలు స్వేచ్ఛగా ఫిర్యాదు చేయాలి
- విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్

కరీంనగర్, జూన్ 18 (నమస్తే తెలంగాణ)/ కార్పొరేషన్: తప్పు చేసిన వారు తప్పించుకోలేరని, కరీంనగర్ మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమది ప్రజాస్వామిక ప్రజల ప్రభుత్వమని, రాజకీయ జోక్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితులను కల్పిస్తున్నామని చెప్పారు. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయబోతున్నామని, ఎక్కడైనా తప్పు జరిగినా అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలకు సూచించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నగర పాలక సంస్థ అధికారులు, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నగరంలో చేపట్టిన పనులపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిపారు. సీఎం అస్యూరెన్స్ కింద, స్మార్ట్ సిటీ కింద చేపట్టిన పనుల ప్రగతితోపాటు తాగు నీటి సరఫరా, శానిటేషన్‌పై ప్రధానంగా చర్చించామని వెల్లడించారు. స్మార్ట్ సిటీలో భాగంగా వైఫై హాట్‌స్పాట్లు ఏర్పాటు, టెక్నాలజీ కాంపొనెంట్ కింద ₹98 కోట్లతో అనేక రకాల పనులు , 700 సీసీ కెమెరాలు ఏర్పాటు, సీసీ టెలివిజన్ తదితర పనుల ప్రగతి చర్చించామని తెలిపారు. ఇక నుంచి వారానికో విభాగంపై సమీక్షించాలని కలెక్టర్ పమేలా సత్పత్తిను కోరినట్టు చెప్పారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో పాటు ఇతర గ్రాంట్లలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కలెక్టర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కూడా మున్సిపల్ బిల్లుల విషయంలో దృష్టి సారించాలని ఆదేశించామని, మెప్మా సంఘాలకు ఇచ్చే రుణాలపైనా చర్చించినట్లు చెప్పారు.

కబ్జాలపై ఫిర్యాదు చేయండి

ఎవరైనా భూకబ్జాలకు పాల్పడినా, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం చేసినా స్వేచ్ఛగా అధికారులకు ఫిర్యాదు చేయాలని నగర ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అనధికారిక నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారుల సంయుక్తంగా విచారణ జరపాలని ఆదేశించామని, వివరాలు సేకరించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీటిపై తమకు ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.

ఎంఆర్ఎఫ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మానేరు రివర్ ఫ్రంట్ (ఎంఆర్ఎఫ్)లో 72 శాతం పనులు పూర్తయ్యాయని, వానకాలం నేపథ్యంలో మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. టూరిజం డెవలప్‌మెంట్‌కు ₹100 కోట్లు మంజూరు చేస్తే ₹30 కోట్లు విడుదల చేశారని తెలిపారు. అందులో ₹5 కోట్ల వరకు మాత్రమే ఖర్చు చేసినట్టు అధికారులు వివరించారని, ఈ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

నాణ్యతాలోపం ఉంటే చర్యలు

స్మార్ట్‌సిటీలో భాగంగా చౌరస్తాల ఆధునీకరణ కింద ఇందిరా చౌక్‌లో ₹1.30 కోట్లు ఖర్చు చేశారని, ఎలాంటి అనుమతి లేకుండా ₹50 లక్షలు అదనంగా ఖర్చు పెట్టారని అధికారులు చెప్పారని మంత్రి తెలిపారు. నాణ్యతా ప్రమాణాల విషయమై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో విజిలెన్స్ విచారణ జరుగుతున్నదని, ఎక్కడైనా లోపం ఉంటే తదుపరి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని వివరించారు. నగరంలో మొదట ట్రాఫిక్ సిగ్నల్ అవసరం లేదనుకున్నారని, ఇప్పుడు ఆరు చౌరస్తాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేశారని, దీనిపైనా సమీక్షిస్తామన్నారు. మున్సిపల్ పనుల్లో అక్రమాలు జరిగినట్టయితే ప్రభుత్వ విధానాల మేరకు చర్యలు ఉంటాయని వెల్లడించారు. స్మార్ట్ సిటీ కింద చేపట్టిన 79 పనుల్లో కొన్నింటిని ఇతర పథకాల కింద వచ్చిన నిధులతో కూడా చేపట్టారని, ఓవర్ లాపింగ్ పనులపై విచారణ జరిపిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖతోపాటు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విలేకరుల సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కే మహేశ్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సరే.. సమాచారమేది ?

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, హాజరైన వివిధ శాఖల అధికారులు

- అందుబాటులోనే ఎమ్మెల్యే గంగుల
- సమాచారం లేక హైదరాబాద్‌కు నగర మేయర్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్‌కూ అందని ఆహ్వానం
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీరుపై విమర్శలు
- అభివృద్ధి పనులపై ఏకపక్షంగా సమీక్ష నిర్వహించారనే అభిప్రాయాలు
- ఇది పూర్తిగా ప్రొటోకాల్ విస్మరణే అనే కామెంట్లు
- మాకు ఎటువంటి సమాచారం లేదు: కమలాకర్, సునీల్‌రావు

కరీంనగర్, జూన్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మొదటిసారి మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సమీక్షలో చర్చించిన అంశాలను వెల్లడించారు. సీఎం అస్యూరెన్స్, స్మార్ట్ సిటీ కింద చేపట్టిన పనులతోపాటు తాగు నీటి సరఫరా, శానిటేషన్ వంటి విషయాలను చర్చించినట్టు తెలిపారు. స్మార్ట్ సిటీ కింద 79 పనుల్లో కొన్నింటిని ఇతర పథకాల కింద వచ్చిన నిధులతో కూడా చేపట్టారని, ఓవర్ లాపింగ్ పనులపై విచారణ జరిపిస్తున్నట్టు చెప్పారు. స్మార్ట్‌సిటీలో భాగంగా చౌరస్తాల ఆధునీకరణ కింద ఇందిరాచౌక్‌లో ₹1.30 కోట్లు ఖర్చు చేశారని, ఎలాంటి అనుమతులు లేకుండా ₹50 లక్షలు అదనంగా ఖర్చు జరిగినట్టు అధికారులు చెప్పారని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల విషయమై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో విజిలెన్స్ విచారణ జరుగుతున్నదని, ఎక్కడైనా నాణ్యతాలోపం ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అయితే మంత్రి హోదాలో సమీక్షించడాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు కానీ, ఈ విషయంలో ఆయన వ్యవహరించిన తీరు ప్రస్తుతం వివాదస్పదమవుతున్నది. నిజానికి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గతంలో అనేక సార్లు మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు సమీక్షించారు. స్మార్ట్ సిటీ ఫండ్స్ వినియోగంపై వారికి పూర్తి అవగాహన ఉంది. అలాగే స్మార్ట్ సిటీ పనులు, నిధులు కేంద్రంతో ముడిపడి ఉన్నాయి. అంతేకాదు, నగరంలో అభివృద్ధి పనులు ముందుకెళ్లాలంటే మేయర్‌తో పాటు పాలకవర్గం మద్దతు తప్పనిసరి అవసరం. అయితే మొదటిసారి సమీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. బండి సంజయ్, గంగుల కమలాకర్, సునీల్‌రావుకు సమాచారం ఇవ్వకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఒక వేళ మంత్రి పొన్నం పేషీ నుంచి సమాచారం ఇవ్వలేని పరిస్థితి ఉంటే అధికారులైనా సమాచారం ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రొటోకాల్ ప్రకారం చూసిన ఎంపీగా, ఎమ్మెల్యేగా, మేయర్‌గానే కాదు, కార్పొరేషన్ పాలక వర్గంలో ఈ ముగ్గురు సభ్యులే. సమాచారం ఇచ్చిన తర్వాత ఏదైనా కారణాల వల్ల వాళ్లు రాకపోవడం వేరు. నిజానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం మొత్తం స్థానికంగా అందుబాటులోనే ఉన్నారు. ఎమ్మెల్యే విధుల్లో భాగంగా ఆయన తన కార్యాలయంలో ప్రజలతో మమేకమయ్యారు. మేయర్ సునీల్‌రావుకు సమాచారం లేకపోవడంతో ఆయన హైదరాబాద్ వెళ్లారు. సమీక్షా సమావేశం గురించి తమకు ఏమాత్రం సమాచారం లేదని, అధికారుల నుంచి గానీ, మంత్రి పేషీ నుంచి గానీ తమకు ఆహ్వానం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు తెలిపారు.

కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై మొదటిసారి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించడం బాగానే ఉన్నది! కానీ, స్థానిక ఎంపీ, ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ సునీల్‌రావుకు కనీస సమాచారం ఇవ్వకుండా నిర్వహించిన తీరు ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. నగరాభివృద్ధిలో ఆ ముగ్గురి సహకారం తప్పనిసరి అని తెలిసినా.. ఆహ్వానం అందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది పూర్తిగా ప్రొటోకాల్ విస్మరణే అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ మంత్రి పేషీ నుంచి సమాచారం ఇవ్వలేని పరిస్థితి ఉంటే అధికారులైనా ఆహ్వానించాలి కదా..! అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో సమీక్షా సమావేశానికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు స్పష్టం చేయడం చూస్తే కావాలనే పిలువ లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయాలకు అతీతంగా..

ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అన్నీ పార్టీలను కలుపుకొని ప్రగతిలో ముందుకెళ్లాలంటూ వివిధ సందర్భాల్లో మంత్రి పొన్నం చెబుతూ వస్తున్నారు. అదే నిజమైతే సుమారు ₹650 కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల సమీక్షకు ఏకంగా మేయర్‌కే సమాచారం ఇవ్వకపోవడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ స్థానికంగా అందుబాటులో ఉన్న ఆ విషయం అందరికి తెలిసిందే అయినా సమీక్షకు ఎందుకు ఆహ్వానించలేదన్న చర్చ జరుగుతున్నది. నగరంలో అభివృద్ధి పనులు ముందుకెళ్లాలంటే.. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ సహకారం తప్పనిసరి. వారికే సమాచారం లేకుండా సమీక్షలు నిర్వహించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి నగరంలో అనేక అభివృద్ధి పనులు కొన్ని నెలుగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే, మేయర్ పాల్గొని ఉంటే.. ఆ విషయాలను ప్రస్తావించే వారు. వాటికి కారణాలను కనుక్కొని.. పరిష్కారం దిశగా అడుగులు వేసే పరిస్థితి ఉండేది. కానీ, సమీక్ష అందుకు పూర్తిగా విరుద్ధంగా జరిగింది. మొత్తంగా చూస్తే నగరంలో అభివృద్ధి పనులు కొనసాగాలంటే సమన్వయంతో ముందుకెవ్వేతప్ప సాధ్యం కాదన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఏకపక్షంగా సమీక్ష నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎలా స్పందిస్తారో చూడాలి.

బీఆర్ఎస్‌లో నయా జోష్

- కేశోరాంలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో పార్టీ నేత, గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశికహరి ప్యానల్ జయకేతనం
- ప్రధాన కార్యదర్శిగా మాదాసు శ్రీనివాస్ విజయం
- కాంగ్రెస్ కంచుకోట బద్దలు
- ఏడేండ్ల తర్వాత ఎగిరిన గులాబీ జెండా
- శ్రేణుల్లో నూతనోత్సాహం

విజయోత్సవర్యాలీలో అధ్యక్షుడు కౌశికహరి, ప్రధానకార్యదర్శి మాదాసుశ్రీనివాస్

పాలకుర్తి, జూన్18: రామగుండం బీఆర్ఎస్‌లో నయాజోష్ కనిపిస్తున్నది. పారిశ్రామిక ప్రాంతంలో కీలకమైన కేశోరాం కార్మాగారం గుర్తింపు సంఘం ఎన్నికల్లో జయకేతం ఎగరేసి, కాంగ్రెస్ కంచుకోట బద్దలు కొట్టడంతో కేడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తున్నది. దాదాపు ఏడేండ్ల తర్వాత ఫ్యాక్టరీలో బీఆర్ఎస్ నేత, కేశోరాం గుర్తింపు సంఘం అధ్యక్షుడు కౌశికహరి ప్యానల్ ప్రధాన కార్యదర్శిగా అభ్యర్థి మాదాసు శ్రీనివాస్ ఘన విజయం సాధించడంతో సంబురాల్లో మునిగితేలారు. కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి గుర్తింపు సంఘం ఎన్నికలను యాజమాన్యం మంగళవారం నిర్వహించగా, ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 809 మంది ఓటర్లకుగాను 787 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, ఇందులో బీఆర్ఎస్ నేత కౌశికహరి ప్యానల్ అభ్యర్థి మాదాసు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. శ్రీనివాస్‌కు 418 ఓట్లు రాగా, కాంగ్రెస్ నేత బయ్యపు మనోహర్‌రెడ్డి ప్యానల్ అభ్యర్థి నగునూరి రమేశ్‌కు 352 ఓట్లు వచ్చాయి. సదయ్యకు ఒకటి, నరేష్ తొమ్మిది ఓట్లు వచ్చాయి. 7 ఓట్లు చెల్లలేదు. నగునూరి రమేశ్‌పై మాదాసు శ్రీనివాస్ 66 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి బీ డానియల్ ప్రకటించారు. హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడంపై కార్మికులు, పాలకుర్తి మండలంతో పాటు, అంతర్గాం, రామగుండం ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ వేడుకలు జరుపుకొన్నారు. గత శాసనసభ, పార్లమెంట్‌లో ఓటమితో నిరుత్సాహంగా ఉన్న కేడర్‌కు ప్రతిష్టాత్మక కేశోరాం ఎన్నికల్లో విజయం ఎంతో సంతోషాన్నిచ్చింది.

ఫ్లైయాష్ తరలిస్తూ.. అడ్డంగా చిక్కి

- జెన్కో బూడిదను అక్రమంగా తరలిస్తున్న నలుగురి అరెస్ట్

జ్యోతినగర్, జూన్ 18: ఫ్లైయాష్ తరలిస్తూ అడ్డంగా దొరికిపోయారు. నలుగురు నిందితులను పోలీసులకు చిక్కారు. అందుకు సంబంధించిన వివరాలను మంగళవారం గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ వెల్లడించారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌కు చెందిన ఎడ్ల సాయితేజ అలియాస్ బంటికి ఎక్స్‌కవేటర్ ఉన్నది. దీనిపై లక్ష్మీపురం ఏరియాకు చెందిన ఆడిచెర్ల శ్రావణ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సాయితేజ కొద్ది రోజులుగా అక్రమంగా ఫ్లైయాష్ దందా చేస్తున్నాడు. తనకున్న ఎక్స్‌కవేటర్‌తో క్రషర్‌నగర్ ఏరియాలో ఉన్న బీ ధర్మల్ విద్యుత్ కేంద్రానికి (జెన్‌కో) చెందిన యాష్‌పాండ్‌లోని బూడిదను దొంగతనంగా లారీలో లోడ్ చేసి, అక్రమంగా తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం కూడా లారీలో బూడిదను తరలిస్తుండగా తెలంగాణ జెన్‌కో సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఈ మేరకు జెన్‌కో ఈఈ గడ్డం సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేశారు. ఎడ్ల సాయితేజ, శ్రావణ్, కరీంనగర్‌కు చెందిన లారీ డ్రైవర్లు సౌదాగర్, రామ్‌జనం చౌహాన్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. రెండు లారీలు, ఎక్స్‌కవేటర్, కారును స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక పనులు చేపడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలుంటాయని ఏసీపీ హెచ్చరించారు. ఇక్కడ రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ ఉన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

ముజామ్మిల్‌ఖాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

- పెద్దపల్లి నూతన కలెక్టర్ కోయ శ్రీహర్ష
- కొత్త కలెక్టర్‌కు ఘన స్వాగతం
- ముజామ్మిల్ ఖాన్‌కు ఆత్మీయ వీడ్కోలు

పెద్దపల్లి, జూన్18: పెద్దపల్లి జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని నూతన కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ముజామ్మిల్‌ఖాన్‌కు ఆత్మీయ వీడ్కోలు, జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన కోయ శ్రీహర్షకు స్వాగత కార్యక్రమాన్ని మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో 11 నెలల కాలంలో ముజామ్మిల్‌ఖాన్ విశేష సేవలందించారని, ఖమ్మం జిల్లాలో సైతం మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పెద్దపల్లి జిల్లాను మరింత అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. బదిలీపై ఖమ్మం కలెక్టర్‌గా వెళ్తున్న ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులందరికీ ప్రత్యేక హెల్త్ క్యాంపు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. 11నెలల కాలం చాలా మంచిగా గడిచిందని, ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయడంలో అధికారు లు, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించారని తెలిపారు. వి ద్యా వ్యవస్థలో మంచి మార్పులు తీసుకొని వచ్చే దిశగా 'లం చ్ అండ్ లెర్న్', సమ్మర్ క్యాంప్ నిర్వహణ, రీడింగ్ రూమ్‌ల ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టడం సంతోషాన్ని ఇచ్చాయన్నారు. అనంతరం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు గంగయ్య, హనుమానాయక్, అధికారులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం..

మామిడిపల్లిలో కప్పతల్లి ఆడుతున్న రైతులు, యువకులు

కోనరావుపేట, జూన్ 18: వానకాలం సీజన్ మొదలైనా వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం మొగులు కేసి చూస్తున్నారు. మంగళవారం మామిడిపల్లి గ్రామంలో ఆంజనేయ సంఘం ఆధ్వర్యంలో యువకులు, రైతులు కప్పతల్లి ఆడారు. రోకలి బండకు కప్పను కట్టుకొని ఇంటింటా తిరిగారు. మహిళలు రోకలిపై బిందెలతో నీళ్లను పోశారు. వాన దేవుడు కరుణించాలని, వానలు పడి విత్తనాలు మొలకెత్తి పంటలు బాగా పండేలా చూడాలని వేడుకున్నారు. అలాగే గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు.

మా భూమిని కాపాడండి మేడం

ఫిర్యాదు పత్రంతో మెట్లపై కూర్చున్న రాజయ్య దంపతులు

కలెక్టరేట్, జూన్ 18: 'తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఓ ఇద్దరు కబ్జా చేసిన్రు. ఇదేందని అడిగితే చంపుతామని బెదిరిస్తున్రు. వారి బారి నుంచి మమ్మల్ని, మా భూ మిని కాపాడండి కలెక్టర్ మేడం' అంటూ తిమ్మాపూర్ మండలం మక్తపల్లికి చెందిన వృద్ధ దంపతులు రాజయ్య, నర్సవ్వ వేడుకుంటున్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్‌కు మొరపెట్టుకునేందుకు వచ్చారు. మంత్రి సమీక్ష ఉండడంతో ఇలా మెట్లపై కూర్చుండిపోయారు. తనకు గ్రామంలోనే వేర్వేరు సర్వే నంబర్లలో 27గుంటల భూమి ఉన్నదని రాజయ్య చెప్పాడు. సదరు భూమిని గ్రామానికి చెందిన ఓ ఇద్దరు ఆక్రమించుకున్నారని వాపోయాడు. గ్రామంలో పెద్ద మనుషుల వద్దకు పిలిపిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని ఆ దంపతులు ఆవేదన చెందారు. కబ్జాదారుల నుంచి తమను కాపాడాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571